## క్లుప్తంగా

### నోట్ బుక్స్ పంపిణీ


విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

మునగాల : మండలంలోని నారాయణగూడెం, బరాఖత్‌గూడెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు శనివారం వాసవీ క్లబ్ గ్రేటర్, వనిత, ఫ్యామిలీస్ వారి ఆధ్వర్యంలో వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ వంగవేటి వెంకటగురుమూర్తి చేతుల మీదుగా నోట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ ప్రతాపనేని సతీష్, క్లబ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కాపర్తి మణికంఠకుమార్, చక్కా కిశోర్, వనిత క్లబ్ అధ్యక్షురాలు తోట రమాదేవి, పద్మ, శ్వేత, రామారావు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం


కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

మునగాల : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు దసరా కానుకగా సీఎం కేసీఆర్ అల్పాహార పథకం అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడంపై బీఆర్‌ఎస్‌వీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బీఆర్‌ఎస్‌వీ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ పాషా ఆధ్వర్యంలో సీఎం కేఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్‌వీ కోదాడ పట్టణ అధ్యక్షుడు వంశీ నాని, మునగాల మండల అధ్యక్షుడు బెల్లంకొండ ఉపేందర్, నాయకులు జానీ, సాయి, మహేష్, రియాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

### గీత పనివారల సంఘం మండల అధ్యక్షుడిగా గోపి

మేళ్లచెరువు : గీత పనివారల సంఘం మేళ్లచెరువు మండల అధ్యక్షుడిగా సోమగాని గోపిని నియమించినట్లు సీపీఐ అనుబంధ గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి కొండ కోటయ్య తెలిపారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గీత పనివారల సంఘం కమిటీని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాలకూరి బాబు, మండల కార్యదర్శి పాపిరెడ్డి సమక్షంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు ఉప్పతల కోటమ్మ, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### అఖిలపక్షం నిరసన ర్యాలీ

కోదాడరూరల్ : మాజీ సీఎం చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా అఖిలపక్షం ఆధ్వర్యంలో శనివారం కోదాడ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు వేనేపల్లి చందర్‌రావు, ఎన్.పద్మావతిరెడ్డి, అఖిలపక్షం నాయకులు వంగవీటి రామారావు, మేకల శ్రీనివాసరావు, ముత్యాలు, ముత్తినేని సైదేశ్వరరావు, తొండపు సతీష్, ఓరుగంటి ప్రభాకర్, ఉప్పగండ్ల సరోజశ్రీనివాస్, ముత్తవరపు ఆంధ్రజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


శ్రీమేఘనను అభినందిస్తున్న మేరెడ్డి ఎల్లారెడ్డి

హుజూర్‌నగర్ : పట్టణంలో ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) క్రీడల్లో పట్టణంలోని చైతన్య హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. మండల స్థాయి అండర్- 17 బాలుర విభాగం కబడ్డీ పోటీల్లో ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. రన్నింగ్ 100.మి, 400. మి విభాగంలో పోలంపల్లి శ్రీమేఘన ద్వితీయ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ మేరెడ్డి ఎల్లారెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించి జ్ఞాపికలు బహుకరించి వారి క్రీడా స్ఫూర్తిని ప్రశంసించారు. కార్యక్రమంలో వ్యాయామ విద్య ఉపాధ్యాయుడు కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎరువుల దుకాణాలు తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ రజిని

కోదాడరూరల్ : ఈ -పాస్ యంత్రాల ద్వారా ఎరువులను విక్రయించాలని ఏఓ పాలెం రజిని దుకాణదారులకు సూచించారు. శనివారం పట్టణంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాలను ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. ఎరువుల నిల్వలను, అమ్మకాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసుకుని, ఈ పాస్ యంత్రాల్లో క్లియరెన్స్ చేయాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించి ఎరువులను అధిక ధరకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రైతు బీమా.. కొండంత ధీమా

- ఈ ఏడాది నూతనంగా 623 మంది రైతులకు రైతు బీమా పథకం వర్తింపు
- ఇప్పటివరకు 245 మంది రైతు కుటుంబాలకు సహాయం


రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఓ

గరిడేపల్లి : రైతు బీమా పథకం రైతుల కుటుంబాలకు భరోసాగా నిలుస్తోంది. అనుకోని పరిస్థితుల్లో రైతు మరణిస్తే అతని కుటుంబానికి ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షల సహాయం కొండంత ధీమా ఇస్తోంది. కాగా ఈ ఏడాది కొత్తవారికి రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించడంతో కొత్తగా భూములు కొనుగోలు చేసిన రైతులు దరఖాస్తు చేసుకున్నారు. మండలంలో సుమారు 40 వేల ఎకరాల ఆయకట్టు ఉండగా 16 వేల 233 మంది రైతులు ఉన్నారు. వీరిలో 11 వేల 632 మంది రైతులు గత ఏడాది అర్హులు కాగా ఈ ఏడాది మరో 632 మంది రైతులకు నూతనంగా దరఖాస్తు చేసుకున్నారు. దీంతో 12 వేల 264 మంది రైతులను మండలంలో అర్హులుగా గుర్తించారు. 2018 నుంచి నేటివరకు మండల వ్యాప్తంగా 245 మంది రైతులకు 12 కోట్ల 25 లక్షల రూపాయలను రైతు బీమా ద్వారా అందించినట్లు అధికారులు తెలిపారు.

### అర్హులుగా మరో 632 మంది రైతులు



రైతు బీమా పథకంలో ఈ ఏడాది 632 మంది చేరారు. 32 గ్రామ పంచాయతీ పరిధిలో రైతు బీమా పథకం కింద 2018 నుంచి నేటి వరకు 245 మంది రైతులు చనిపోగా ఒక్క కుటుంబానికి రూ.5లక్షల చొప్పున సహాయాన్ని ప్రభుత్వం అందించింది.

– ప్రియతమ్‌కుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి, గరిడేపల్లి

### రైతు బీమాతో ఎంతో మేలు



రైతు బీమా పథకంతో రైతుల కుటుంబాలకు ఎంతో మేలు. అనుకొని పరిస్థితుల్లో రైతు చనిపోతే ప్రభుత్వం ఈ పథకం ద్వారా నామినికి రూ.5 లక్షలు అందిస్తుంది. ఈ సహాయం రైతు కుటుంబానికి ఆసరాగా ఉంటుంది.

– పెండెం వీరయ్య గౌడ్, హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్

## మల్లారెడ్డిగూడెం చరిత్ర మరువలేనిది


అమరవీరుల స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో మల్లారెడ్డిగూడెం చరిత్ర మరువలేనిదని జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తెల సృజన అన్నారు. శనివారం చింతలపాలెంలో సీపీఐ ఆధ్వర్యంలో రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన ఎనిమిది మంది అమరవీరుల స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సాయుధ పోరాటంలో ఎలాంటి పాత్ర పోషించని కొన్ని బూర్జువా పార్టీలు గొప్పలు చెప్పుకొంటూ ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. చరిత్ర తుడిపేస్తే పోయేది కాదని ఆమె పేర్కొన్నారు. అనంతరం రైతాంగ సాయుధ పోరాట యోధుడు మాజీ సర్పంచ్ ఉస్తెల వీరారెడ్డి సతీమణి ఉస్తెల రాములమ్మ మూడవ వర్ధంతి వేడుకల్లో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కోటమ్మ, సీపీఐ మండల కార్యదర్శులు రవి, పాపిరెడ్డి, మాజీ సర్పంచ్ గోనె లక్ష్మీ అంకయ్య, నాయకులు అంకరాజు, వీరబాబు, జియాలుద్దీన్, భీమిశెట్టి పద్మ, శ్రీను, రామారావు, కృష్ణ, యలమంద తదితరులు పాల్గొన్నారు.

### రేషన్ దుకాణం ప్రారంభం


రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ నాగేశ్వరరావు

నడిగూడెం : మండల కేంద్రంలో నాల్గవ రేషన్ దుకాణాన్ని శనివారం తహసీల్దార్ టి.నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు దుకాణాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, మాజీ సర్పంచ్ దున్నా సుధాకర్, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు వరికల రమేష్, బొల్లం శ్రీను, దాసరి శ్రీను, చంద్రయ్య, జలీల్, పుల్లయ్య, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### బూరుగడ్డ ఆలయంలో జడ్జి దంపతుల పూజలు


పూజలు చేస్తున్న జడ్జి భవ్య దంపతులు

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరాహ లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో శనివారం కోదాడ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి భవ్య దంపంతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారిని శాలువా, పూలమాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరీష్‌చార్యులు, చైర్మన్ గుండు సైదులు, ధర్మకర్త సర్వే కుషల్, ఈఓ లక్ష్మణరావు, భక్తులు పాల్గొన్నారు.

## రూ.8.25 కోట్ల పనులకు ఆమోదం

కోదాడ : పపట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ సమావేశం శనివారం చైర్‌పర్సన్ వనపర్తి శిరీష అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గత నెలలో సూర్యాపేటలో జరిగిన ప్రగతి నివేదిక సభలో కోదాడ మున్సిపాలిటీకి రూ.25 కోట్లు మంజూరు చేసినందుకు గాను సీఎం కేసీఆర్‌కు పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది. మున్సిపాలిటీ పరిధిలో 8.25 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సమావేశం ఆమోదం తెలిపింది. వినాయక చవితి సందర్భంగా పట్టణంలో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని సభ్యులు కోరారు. వినాయక మండపాల వద్ద పారిశుద్ధ్య పనులను మున్సిపాలిటీ సిబ్బంది నిర్వహిస్తారని, అవసరమైన వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం మహిళల రాస్తారోకో


ఎన్‌టీఆర్ నగర్ వద్ద జడ్చర్ల- కోదాడ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మహిళలు

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌టీఆర్ నగర్‌లో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని శనివారం మహిళలు ఖాళీ బిందెలతో జడ్చర్ల- కోదాడ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ కాలనీలో మిషన్ భగీరథ పైపులు పగిలి గత ఐదు రోజులుగా తాగునీరు రావడం లేదని, ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాగా ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ అక్కడికి చేరుకొని కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడగా పైపులైన్ మరమ్మతులు పూర్తయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ఈ విషయంపై మిషన్ భగీరథ ఏఈ శ్రీనాథ్‌ను వివరణ కోరగా యుద్ధప్రాతిపదికన పైపులైన్ మరమ్మతులు చేసి నీటి సరఫరా చేస్తామని తెలిపారు.

### విద్యార్థులకు దుస్తులు పంపిణీ


విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మిర్యాలగూడలోని సుప్రియ రెడిమెడ్ షాపు సహకారంతో నేరేడుచర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య చేతుల మీదుగా శనివారం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, కట్టా మాధవి, దాత అల్లాని సతీష్‌కుమార్, ఉపాధ్యాయులు శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, అశోక్‌కుమార్, లయన్స్ క్లబ్ సభ్యులు రామస్వామి, రంగారెడ్డి, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలలో మాక్ పోలింగ్


మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

మఠంపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ పాల్గొని మాట్లాడారు. భవిష్యత్‌లో బాధ్యత గల పౌరులుగా ఓటు వేసేందుకు విద్యార్థులకు సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు పిల్లుట్ల వీరస్వామి ఆధ్వర్యంలో మాక్ పోలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, నరసింహారావు, అమలారాణి, నాగమణి, విజయలక్ష్మి, సీతారాంరెడ్డి, శంకర్, బ్రహ్మం, విద్యార్థులు పాల్గొన్నారు.

### అందుబాటులో యూరియా

చిలుకూరు: రైతులకు కావాల్సిన యూరియా అందుబాటులో ఉందని జిల్లా సహకార సంఘం ఆడిటర్ అంబేద్కర్ తెలిపారు. శనివారం చిలుకూరు మండలం నారాయణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోని యూరియా గోదాములతో పాటు రికార్డులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సాకి బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ అధికారులు

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఇండియన్ స్వచ్ఛత 2.0లో భాగంగా హుజూర్‌నగర్‌లోని గ్రీన్ వుడ్ పాఠశాలలో తడి చెత్త, పొడి చెత్త వేరు చేయుట, కంపోస్ట్ ఎరువు తయారు చేయుటపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరుతూ విద్యార్థులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం టి మర్రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, జవాన్లు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో పేరు చూసుకోవాలి


గరిడేపల్లి : మాట్లాడుతున్న తహసీల్దార్ కవిత

గరిడేపల్లి : ప్రతిఒక్కరూ చెక్ యువర్ ఓటు యాప్‌లో గల ఓటరు జాబితాలో తమ పేరు చూసుకోవాలని తహసీల్దార్ బండ వనజ, ఎంపీడీఓ హనుమంతరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో 'చెక్ యువర్ ఓటు' కార్యక్రమంలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, బీఎల్‌ఓలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ మౌలానా, ఏపీఓ సురేష్, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

**ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలి**

మోతె : 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందాలని తహసీల్దార్ ఎస్‌టి ప్రకాష్‌రావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అజయ్, సర్పంచ్ మెట్టు అలివేలు, కార్యదర్శి కల్పన, బూత్ లెవల్ అధికారి పద్మ, తదితరులు పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం


కట్ట మాధవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మండలంలోని దిర్శించర్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కట్టా మాధవిని శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, స్వాతి, శ్రీదేవి, శ్రీనివాస్‌రావు, యాదగిరి తదితరులు ఉన్నారు.

### స్వచ్ఛందంగా అభివృద్ధి పనులు

మఠంపల్లి : మండలంలోని పాతదొనబండతండాలో స్థానిక కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బాగ్యానాయక్, నాయక్ ఫౌండేషన్ చైర్మన్ భూక్యా కోటేష్‌నాయక్‌లు శనివారం స్వచ్ఛందంగా డ్రెయినేజీ నిర్మాణానికి కాలువలు తవ్వించారు. అదేవిధంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను తొలగించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు జగన్‌నాయక్, లష్కర్‌నాయక్, బాబ్లా, దూబ్లా, సక్రు, బాబు, మానా, లింగా, రమేష్, వెంకట్రాం, రాజు, శివ, తదితరులు ఉన్నారు.


కాలువ తవ్విస్తున్న యువకులు, గ్రామస్తులు

## ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండా

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


కోదాడ : పార్టీలో చేరుతున్న వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

కోదాడ : నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన ఎజెండా అని, నిత్యం ప్రజల మధ్య ఉండే తనకు ప్రజల మద్దతు ఉందని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం కోదాడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అందుబాటులో లేనివారు చెపుతున్న మాటలను ప్రజలు విశ్వసించరని అన్నారు. మునగాల పరగణాలో హత్యారాజకీయాలను ప్రోత్సహించినది ఎవరో, వాటి వెనుక ఉన్నది ఎవరో ప్రజలకు తెలుసని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఎన్ని కేసులయ్యాయి.. ఈ ఐదు సంవత్సరాల కాలంలో ఎన్ని కేసులయ్యాయో పరిశీలించాలని అన్నారు. ప్రాధాన్యత క్రమంలో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

**బీఆర్‌ఎస్ పార్టీతోనే పేదలకు మేలు**

కోదాడ : బీఆర్‌ఎస్ పార్టీతోనే పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం కోదాడలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిలుకూరు మండలం నారాయణపురానికి చెందిన పలువురు ఆయన సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. పార్టీలో చేరుతున్న వారికి తగిన ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కొండ సైదయ్య, యాదగిరి, భట్టు శివాజీ, జనార్దన్, దొడ్డ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా**

మునగాల : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శనివారం మండలంలోని తాడువాయికి విచ్చేసిన ఎమ్మెల్యేను భవన నిర్మాణ కార్మికులు కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు వర్తింపచేసే విధంగా చర్యలు చేపడతామన్నారు. అదేవిధంగా గ్రామంలో ఇటీవల మృతిచెందిన గట్టు స్వరూప చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల నాయకుడు కోల ఉపేందర్‌రావు, సర్పంచ్ లొడంగి సంజీవ, గ్రామశాఖ అధ్యక్షుడు చిర్రా సైదులు, నాయకులు గట్టు ఉపేందర్‌రావు, ఆంజనేయులు, లక్యా నాయక్, జిల్లేపల్లి ప్రసాద్, యాదగిరి, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నాయకులు కోల ఆంజనేయులు, వీరన్న, అంజిబాబు, సైదులు, ఉపేందర్, మల్లన్న యువసేన నాయకులు ఉన్నారు.

## గాదె ఎలియాస్‌రెడ్డికి నివాళి


ఎలియాస్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ దివంగత గాదె ఎలియాస్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శుభవార్త చర్చిలో జరిగిన ఎలియాస్‌రెడ్డి సంతాప సభకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, అనంతరం కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. అదేవిధంగా చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదూరి స్రవంతికిషోర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ అరుణాసైదులు, బోయపాటి ఆంతోనిరెడ్డి, ఏసుమళ్ల రాములు, మాలోతు సక్రునాయక్ తదితరులు ఉన్నారు.

## 24న రేషన్ డీలర్ల అభ్యర్థులకు అర్హత పరీక్ష

హుజూర్‌నగర్ : నియోజకవర్గంలో 30 రేషన్ డీలర్ల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 24 తేదీన అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి శనివారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 24 ఆదివారం ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల నుంచి హాల్ టికెట్ పొందవచ్చని తెలిపారు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందు చేరుకోవాలని పేర్కొన్నారు. డివిజన్‌లో మొత్తం 30 ఖాళీలు ఉండగా వాటికి 203 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో రిజర్వేషన్, అర్హత లేని దరఖాస్తులు 25 తొలగించగా 178 మంది అభ్యర్థులు అర్హులుగా ఉన్నట్లు తెలిపారు.

## వర్గీకరణ చేయకపోతే బీజేపీకి గుణపాఠం తప్పదు


నేరేడుచర్ల : ఎమ్మార్పీఎస్ దీక్షకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కోదాడరూరల్ : ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టకపోతే రానున్న ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం తప్పదని ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ అన్నారు. పార్లమెంట్ బిల్లు ప్రవేశపెట్టాలని కోదాడలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం ఎనమిదవ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ఉన్నారు.

నేరేడుచర్ల : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ నేరేడుచర్లలో చేపట్టిన ఎమ్మార్పీఎస్ దీక్ష శనివారం 4వ రోజుకు చేరుకుంది. దీక్షకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొణతం చిన వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ప్రకాశ్, నాగయ్య, ఖాదర్, రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు సోములు, వెంకన్న, పాపులు, తిరుపతయ్య, మట్టయ్య తదితరులు ఉన్నారు.

చిలుకూరు : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ చిలుకూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన నిరసన దీక్ష శనివారం ఆరో రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ మాదిగ, మండల ఇన్‌చార్జ్ మల్లెపంగు సూరిబాబు, నాయకులు సిద్దెల శ్రీను, వడ్డేపల్లి రామకృష్ణ, లచ్చయ్య, బాలు, వీరబాబు, సైదులు, సిద్దు, చిరంజీవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మునగాల : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం ఐదవ రోజుకు చేరుకుంది. దీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్.శ్రీనుమాదిగ, మాతంగి ఏసుబాబు, అశోక్, గోపి, రవి, కోటయ్య పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.ఆంజనేయులు అన్నారు. శనివారం చింతలపాలెంలో రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అమీర్ సాహెబ్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు ప్రసాద్, రమేష్, బాలచంద్రు, వీహెచ్‌పీఎస్ నాయకులు నాగేశ్వరరావు, యేసు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం**

మఠంపల్లి : పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి అమలు చేయాలని లేనిపక్షంలో ఎమ్మార్పీస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎమ్మార్పీస్ రాష్ట్ర, జిల్లా నాయకులు అన్నారు. మండల కేంద్రంలో చేపట్టిన ఎమ్మార్పీఎస్ దీక్ష 7వరోజుకు చేరుకుంది. కార్యక్రమంలో నాయకులు చిలకదేవ భిక్షం మాదిగ, దేవపంగు బాబు, దేవపంగు ప్రసాద్, వెంకటేశ్వర్లు, కొండలు, నాగేష్, కిష్టయ్య, నరసింహారావు, నరసయ్య, కమలయ్య పాల్గొన్నారు.

### మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లిశ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి,చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని శనివారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యహోమం, గర్భాలయంలోని శ్రీమూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి, రాజ్యలక్ష్మి,చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, పంచగవ్యప్రాశన, రుత్విగ్వరణం, మధుపర్క పూజ, మాంగల్య ధారణ, తలంబ్రాలతో కల్యాణతంతు ముగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**కాంగ్రెస్ సభను జయప్రదం చేయాలి**

మునగాల : హైదరాబాద్‌లోని తుక్కుగూడలో ఆదివారం జరగబోయే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభను విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జిల్లేపల్లి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. సభకు మండలంలోని యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు.

**మహిళా బిల్లు ప్రవేశపెట్టాలి**

నడిగూడెం : ఈ నెల 18 నుంచి జరగనున్న పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లును ప్రవేశపెట్టాలని జిల్లా పరిషత్ సాంఘిక సంక్షేమ స్థాయి సంఘాల చైర్మన్ బాణాల కవిత శనివారం ఒక ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంట్, అసెంబ్లీ చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు.

**సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలి**

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని సరస్వతి శిశు మందిర్ రోడ్డులో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపాలిటీలోని సరస్వతి శిశు మందిర్ రోడ్డును ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ రోడ్డు మార్గంలో శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంతో పాటు బీసీ, ఎస్టీ హాస్టళ్లు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. రోడ్డు నిర్మించకపోవడంతో వర్షం వచ్చినప్పుడు బురదమయంగా మారి డ్రెయినేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆయన వెంట సీపీఐ మండల కార్యదర్శి సింహాద్రి, సత్యం, లక్ష్మి ఉన్నారు.

**మహాధర్నా వాల్ పోస్టర్ ఆవిష్కరణ**

నేరేడుచర్ల : హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈ నెల 22వ తేదీన జరగనున్న కల్లు గీత కార్మికుల మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ సంఘం గ్రామ అధ్యక్షుడు చనగాని శ్రీనివాస్, ఎంపీటీసీ మండల రాజేష్ కోరారు. శనివారం మండలంలోని మేడారంలో మహాధర్నా పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. నాయకులు సత్యం, సైదులు, లక్ష్మీనారాయణ, నాగరాజు, రవి, జ్యోతి, మహేష్, శ్రీను, సాయి, ముక్కంటి తదితరులు ఉన్నారు.